జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 17-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 594 పేజీలు: 4 వెల : రూ.7

# ప్రభుత్వ భూములు.. టీడీపీ నేతలకు ధారాదత్తం

Adangal Report

| జిల్లా: Srikakulam - శ్రీకాకుళం | | | మండలం: PALASA - పలాస | | | | గ్రామం: PENTIBHADRA - పెంటిభద్ర | | | | | Survey No:: 410-3 | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | సర్వే నెం | పూర్తి విస్తీర్ణం | సాగుకు పనికి రాని విస్తీర్ణం | సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం | భూమి స్వభావం | శిస్తు (రూ.) | భూమి వివరణ | జల ధారము | ఆయకట్టు విస్తీర్ణం | ఖాతా నెంబరు | పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) | అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) | అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) | అనుభవ స్వభావం | రిమార్కులు |
| 1 | 410-3 | 4.5000 | 0.0000 | 4.5000 | పట్టా | 17.80 | నంజ | కాలువ | 0.0000 | 510 | బందారు లక్ష్మి ([illegible]రావు) | బందారు లక్ష్మి (తరణి[illegible]) | 2.0000 | వారసత్వం | |
| 2 | 410-3 | [illegible] | [illegible] | 4.5000 | పట్టా | 17.80 | నంజ | కాలువ | 0.0000 | [illegible]1 | [illegible]రమేష్ [illegible] | కోట్ని [illegible] | [illegible]00 | వారసత్వం | |



* డీ పట్టా పేరుతో పంపిణీపై తీవ్ర దుమారం * కొందరు రెవెన్యూ అధికారుల స్వామి భక్తి * కాసుల కోసం కోట్ల భూములు తాకట్టు * వారి తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**పలాస, ఫిబ్రవరి 16 (వార్త):** కొందరు రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతలకు అమ్ముడుపోయారా? వారి ఒత్తిడి మేరకు ప్రభుత్వ భూములు అప్పనంగా అప్పగించేస్తున్నారా? అన్న అనుమానాలు అందరిలోనూ కలుగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు సైతం రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. ప్రభుత్వ భూములను డీ పట్టాల రూపంలో అధికార పార్టీ నేతలకు ఇచ్చేస్తుండడం పట్ల పలాస నియోజకవర్గంలో దుమారం రేగుతోంది. దీన్ని కప్పిపుచ్చేందుకు ఏం చేయాలో.. అన్నీ చేస్తున్నారు. పలాస సమీపంలోని పెంటిభద్ర గ్రామంలో ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని డీ పట్టాల రూపంలో ప్రైవేట్ వ్యక్తులకు మంజూరు చేసిన వ్యవహారం చర్చనీయాంశమైంది. ఖాతా నంబరు 510, సర్వే నంబరు 410/3 లో బందారు తరణిరావు, బందారు లక్ష్మి పేర్లపై 4.50 ఎకరాలు, అలాగే ఖాతా నంబరు 511, అదే సర్వే నంబరులో వైశ్య సంఘ ప్రెసిడెంట్‌గా పేర్కొనబడుతున్న కోట్ని రమేష్‌కు మరో 4.50 ఎకరాల డీపట్టాను పలాస రెవెన్యూ అధికారులు అప్పనంగా రాసిచ్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూములు ప్రభుత్వ ఖాతాలో ఉన్నవేనని, అయినప్పటికీ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కోట్ని దుర్గా ప్రసాద్ తన బినామీలైన బందారు చిన్నారి తల్లిదండ్రుల పేర్లపై పట్టాలు మంజూరు చేయించుకున్నారని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. పేదలకు కనీసం సెంటు భూమి కూడా ఇవ్వలేని పలాస మండల రెవెన్యూ అధికారులు, పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములను అధికార పార్టీకి చెందిన చోటా నాయకులకు డీ-పట్టాల రూపంలో మంజూరు చేసి, అధికారులే 'స్వామి భక్తి' చాటుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాసేవకులమనే బాధ్యత మరిచి, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాసుల కోసం తాకట్టు పెట్టారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ నేతలకు మేలు చేకూర్చేలా అధికారులు వ్యవహరించారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా మంజూరైన డీ-పట్టాలను రద్దు చేసి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని పెంటిభద్ర గ్రామస్థులు కోరుతున్నారు.



## అధికార పార్టీ నేతల అండదండలతోనే.. కంకర తవ్వకాలు

కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములే కాదు.. కొండలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారుల అనుమతుల్లేకుండా అధికార పార్టీకి చెందిన కొందరు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని ఎంఐజీ లేఅవుట్ పక్కనే ఉన్న పెంటిభద్ర గిరిజన గ్రామం సర్వే నంబర్-410లో ప్రొక్లెయినర్‌తో విచ్చలవిడిగా కంకర తవ్వేస్తున్నారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా పని కానిచ్చేస్తున్నారు. ఇటీవల పలాసలో జరిగిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు మాత్రం పలాస మండలంలో ఎక్కడా గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేదని వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గౌతు శిరీష కూడా తీవ్రంగా స్పందించారు. అక్రమ తవ్వకాలు జరిగితే నా వరకు తీసుకురావద్దు... నేనే అక్కడికి వచ్చి పరిశీలిస్తా అంటూ అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినా పరిస్థితి మారలేదు. అదికార పార్టీకి చెందిన నేతలే తవ్వకాలు చేస్తుంటే.. పాపం అధికారులు ఏం చేస్తారు.. అని మండలవాసులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ అంశంపై పలాస తహసీల్దార్ టి. కల్యాణ చక్రవర్తిని వివరణ కోరగా గ్రావెల్ తవ్వకాలపై ఎవరికీ అనుమతులు లేవన్నారు.



# సుమిత్‌పై.. ఇద్దరమ్మాయిలు కంప్లైంట్

* ఎస్పీ ఆదేశాలతో విచారణ ప్రారంభించిన కాశీబుగ్గ సీఐ


**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 16 (వార్త):** కాశీబుగ్గ మాస్టర్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ నిర్వాహకుడు సుమిత్‌పై ఇద్దరు అమ్మాయిలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. తనకు విడాకులు ఇవ్వకుండా సుమిత్ అలియాస్ మన్మథ రెండో పెళ్లి చేసుకున్నాడని మొదటి భార్య, తనను నమ్మించి మోసగించి పెళ్లి చేసుకున్నాడని, అతడిపై చర్య తీసుకోవాలని, మాలాగే మరో అమ్మాయి బలి కాకుండా చూడాలని రెండో భార్య.. ఎస్పీకి అర్జీ ఇచ్చింది. నువ్వు నాదగ్గర ఉండకపోతే మీ తల్లిదండ్రులపై అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించాడని రెండో భార్య వాపోయింది. ఈ ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కాశీబుగ్గ సీఐ తిరుపతిరావుకు ఎస్పీ ఆదేశించినట్టు తెలిసింది. దీంతో కాశీబుగ్గ సీఐ తిరుపతిరావు వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు.

# ప్రజాదర్బార్ కళకళ.. జడ్పీలో గ్రీవెన్స్ వెలవెల

* పన్నెండు గంటల పాటు ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కేంద్రమంత్రి రామ్మోహన్ * నేతలపై ఉన్న భరోసా.. అధికారులపై లేకపోయిందన్న విమర్శలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16(వార్త):** అధికారులపై నమ్మకం లేకపోయిందో.. లేక అధికార పార్టీ నేతలపై భరోసా పెరిగిందేమో గాని ఎమ్మెల్యేలు, మంత్రులు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కళకళలాడుతుండగా, జడ్పీలో జిల్లా ఉన్నతాధికారులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్ వెలవెలబోతోంది. సోమవారం జడ్పీలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో 94 వినతులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జయదేవిలతో కలిసి డీఆర్వో వి.లక్ష్మణమూర్తి స్వీకరించారు. ఇక కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 1500 మంది వచ్చి పలు సమస్యలపై కేంద్ర మంత్రికి నేరుగా వినతులు అందించారు. సోమవారం ఉదయం పది గంటల నుండి రాత్రి పది గంటలు దాటిన వరకు గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగింది.









# లింగోద్భవం

**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీముఖలింగేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో శ్రీముఖలింగేశ్వరుని లింగోద్భవం కార్యక్రమాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్త వారసురాలు కుమారి కళ్యాణి గజపతి నారాయణ మహాదేవ చేతుల మీదుగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరహర మహాదేవ.. శంభోశంకర నామస్మరణతో శ్రీముఖలింగం మార్మోగింది.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సీసీ నిఘా నీడలో శ్రీముఖలింగం

**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామ ప్రవేశం నుంచి ముగింపు వరకు వివిధ ప్రదేశాల్లో మొత్తం 67 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచామని తెలిపారు. అలాగే సుమారు 400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని, భక్తుల రాకపోకలను సమన్వయం చేస్తూ శాంతిభద్రతలు కాపాడేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. మహాశివరాత్రి పర్వదినం నుంచి చక్రతీర్థ స్నానాల ముగింపు వరకు సీసీ నిఘా కొనసాగుతుందని, భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధివరం రాత్రికి ధధాపుగా 30,000 మంది భక్తులు దర్శించుకున్నారు అని, అలగే సోమవారం 5000 మంది భక్తులు దర్శించుకున్నారు అని అంచనా. కని భక్తులు మాత్రం పోలీసులు అతి ఉత్సాహమ్ వల్లన ఇబంది పడ్డారు. అన్నీ ఏర్పాట్లు పకడ్బందిగా చేసినప్పటికీ భకుతులకు ఇబంధులు తప్పలేదు.



# సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

### -ప్రజల నుంచి 39 అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి మొత్తం 39 అర్జీలు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుడిని సమస్యను తెలుసుకుని వాటిపై సానుకూలంగా స్పందించారు. చట్టపరమైన, వేగవంతమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగేలా సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసం నిలబెట్టే విధంగా పారదర్శకంగా వ్యవ హరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పోలీసు శాఖకు అత్యంత ప్రాధా న్యత అంశమని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చట్టపరమైన చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని, ప్రతి అర్జీపై పర్యవేక్షణ కొనసాగుతుందని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు. స్వీకరించిన 39 ఫిర్యాదుల్లో వ్యక్తిగత, కుటుంబ తగాదాలు, ఆస్తి వివా దాలు, మోసపూరితమైన అంశాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి.



## గిరిజనుల సమస్యలు పరిష్కరించండి



**మందస, ఫిబ్రవరి 16(వార్త):** కుసుమల, కొండలోగాం పంచాయితీలో గల పలు సమస్యలను పరిష్కరించాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నంసింహులు, రైతు కూలీ సంఘం కోనేరు రమేష్, జగ్గారావు, రెండు పంచాయతీలకు పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లారు. కుసుమాల పంచాయితీ బంసుగాం గ్రామం చాపరాయి జన్నివీధిలో ఐటీడీఏ నిధులతో మంజూరైన బీటీ రోడ్ ను పనులను వేగవంతం చేయాలని, బంసుగాం గ్రామములో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, బంసుగాం గ్రామంలో చాపరాయి, జన్నివీధి లకు మేఘ వాటర్ కనెక్షన్ ఇవ్వాలని, కొర్రాయి గేటు నుండి గంద్రుగాం వరకు తారు రోడ్డు మరమ్మత్తు చేయాలన్నారు. కొండలోగాం గ్రామ పంచాయితీ లో గల గ్రానైట్ క్వారీలను పూర్తిగా నిలిపి వేయాలని, శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన గ్రామాల లో 5వ షెడ్యూల్ అమలు చేయాలని, జీడి, మామిడి పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మందస మండలం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, కొండలోగాంలో ఇటీవల కొండలోగాం నుండి దేపురం వరకు వేసిన తారు రోడ్డు నాణ్యత లోపంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. మందస మండలంలోని గిరిజన గ్రామాల్లో భూములు రీసర్వే చేయించాలని, బలియాగాంలో వాటర్ మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# శ్రీముఖలింగంలో భక్తుల అవస్థలు

### -ఆలయం మూసివేతపై ముందస్తు సమాచారం లేక ఇబ్బందులు

### - పోలీస్ అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చామంటున్న ఆలయ వర్గాలు



**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా జాగారం చేసిన భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ సిబ్బంది ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రి సుమారు 10.30 గంటలకు ఆలయాన్ని మూసివేసి, తిరిగి 12.30 గంటలకు తెరిచారని తెలిపారు. దీంతో దర్శనం కోసం వచ్చిన అనేక మంది భక్తులు గుడి మెట్లు వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. కొంతమంది భక్తులు గంట స్తంభం వద్దే పూజలు నిర్వహించి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అసౌకర్యానికి గురయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఆలయ అధికారులు ముందస్తుగా సమయాలపై స్పష్టమైన సమాచారం అందించాలని భక్తులు సూచించారు. ఉత్సవాల సమయంలో సమన్వయం మెరుగుపరిస్తే భక్తులకు ఇబ్బందులు తలెత్తవని వారు అభిప్రాయపడ్డారు. కాని అలయ వర్గలు కధనం ప్రకారం మాత్రం రాత్రి 10:30 నుండి 1:00 వరకు అలయ శాశ్వత ధర్మకర్త వారసురాలు అయినా కుమారి కళ్యాణి గజపతి నారాయణ మహాదేవ (పర్లకిముడి మహారాణి)చేతులూ మిధిగ ప్రతి శివరాత్రి రోజున ఆ సమయంలో లింగోద్భవ కార్యక్రమం అలయం ముసి వేసి జరుగుతుంధి అని పోలీసు శాఖ వారికి ముంధాస్తు సమాచారం ఇచామ్ అని వరు అవి పట్టించుకోకుండా భక్తులను క్యూ లైన్స్ లోకీ వదిలిపెట్టరు అని చెబుతున్నారు. ఏధి ఏం అయిన భక్తులు అధికారులు అంధర్ని తిట్టుకుంటూ వెనుదిరిగారు.

## శ్రీముఖలింగేశ్వరుని దర్శించిన ఎమ్మెల్యే బగ్గు



**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు దేవస్థాన అర్చకులు, అధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వ పాలనలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలుడికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆర్థిక సాయం



**మందస, ఫిబ్రవరి 16(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఓ పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేసింది. సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10,000ల ఆర్థిక సహాయాన్ని విద్యుత్ షాక్ కు గురైన బాలునికి అందజేశారు. వజ్రపుకొత్తూరు మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన సింహాచలం ధనలక్ష్మి కుమారుడు మూడేళ్ళ బాలుడు భువన్ ను ఇటీవల నాన్నమ్మ తినిపించడానికి మేడపైకి తీసికొని వెళ్ళింది. ఇంటిపై వేలాడుతున్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. భువన్ తీవ్రంగా గాయపడడంతో కుడి చేతిని తొలగించారు. ప్రస్తుతం జెమ్స్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసికుంటున్న భువన్ ట్రీట్మెంట్ కోసం ఎక్కువ అమౌంట్ అవసరం కావడంతో దాతలు సహాయం కోరడం జరిగింది. విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు హాస్పిటల్ కు వెళ్లి ఇచ్చారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు మణి, అశోక్ పాల్గొన్నారు.

## భక్తులకు 800 లీటర్ల మజ్జిగ, టన్ను ఉసిరి పంపిణీ



**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర ఆలయంలో భారీగా భక్తులు తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. దీర్ఘ క్యూలైన్లలో నిలబడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు దాహార్తి తీరేందుకు మోజాడ రామారావు ఆధ్వర్యంలో శీతల పానీయాల పంపిణీ చేపట్టారు. సుమారు 800 లీటర్ల మజ్జిగతో పాటు ఒక టన్ను ఉసిరికాయలను భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు ఎండలో, వేడిలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద కార్యకర్తలు పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఉత్సవాల సమయంలో ఇలాంటి ఏర్పాట్లు ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు.

# యువతకు క్రీడలు అత్యవసరం

### - కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

### -'డ్రగ్స్ వద్దు -స్పోర్ట్స్ ముద్దు" బ్రోచర్ల ఆవిష్కరణ

### - సరదాగా బ్యాటింగ్ చేసిన కేంద్ర మంత్రి

**నరసన్నపేట, ఫిబ్రవరి 16(వార్త):** యువత సెల్‌ఫోన్లు, డ్రగ్స్‌కు బానిసలై విలువైన క్రీడలకు దూరమవుతున్న పరిస్థితి ఆందోళనకరమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. యువత శారీరక-మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నరసన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎర్రంనాయుడు ప్రీమియర్ లీగ్ (సీజా-9) క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి, తొలుత దివంగత నేత ఎర్రంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో "డ్రగ్స్ వద్దు -- స్పోర్ట్స్ ముద్దు" అనే అవగాహన బ్రోచర్లను మంత్రి ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ డ్రగ్స్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మంత్రి స్వయంగా మైదానంలోకి దిగి కాసేపు బ్యాటింగ్ చేసి ప్రేక్షకులను అలరించారు. క్రీడాకారులతో పరిచయం పెంచుకుని వారి ఉత్సాహాన్ని అభినందించారు. యువత క్రీడల వైపు మళ్లాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**పోలాకి, ఫిబ్రవరి 17(వార్త):** మబగాం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం సహాయ రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు బగ్గు రమణ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఏడుగురు లబ్ధిదారులకు సుమారు రూ.21 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ సహాయాన్ని అందజేశామన్నారు. అత్యవసర వైద్య చికిత్సలు మరియు ఇతర అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తమవుతుందన్నారు. నిరుపేదలకు బాసటగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు



**ఎల్ఎన్ పేట, ఫిబ్రవరి 16(వార్త):** తమిళనాడు రాష్ట్రంలోని చేతి నగర్ ప్రాంతంలో కొరికాన ఫౌండేషన్, సూడా చైర్మన్ కొరికాన రవికుమార్, భవాని ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో అక్కడ దేవాలయాలు నిర్మించి, ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులు పాటు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సంతృప్తినిచ్చే అన్న సమారాధనకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. అలాగే కొరికాన ఫౌండేషన్ ద్వారా ఆయా కంపెనీలలో పనిచేస్తున్న సిబ్బందితో పూజలు చేయించి,సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, కళాకారులని సత్కరించి, బహుమతులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకాన కుటుంబ సభ్యులు, పలువురు పురోహితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణపై అవగాహన



**పలాస, ఫిబ్రవరి 16(వార్త):** నులిపురుగుల నివారణ అవగాహన సదస్సును పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వసంత్ కుమార్ ఆధ్వర్యంలో పలాస మండలంలోగల వైద్యాధికారులు, మండల విద్యాధికారి, అంగన్వాడి సిపిడిఓ, వైద్య సిబ్బంది నులి పురుగు నివారణ దినోత్సవం గురించి అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పలాస మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపరిధిలో గల అంగన్వాడి కేంద్రాలు, పాఠశాల నందు ఫిబ్రవరి 17వ తేదీన ఎన్ డిడి ప్రోగ్రామ్ నందు ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి పిల్లవానికి ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వరకు వేయాలని చెప్పారు. 1-2 సంవత్సరాలు మధ్యలో ఉన్న చిన్న పిల్లలకు 200 మిల్లీగ్రామ్ (సగం మాత్ర), ఆతర్వాత పైబడిన పిల్లలకు 400 మిల్లీగ్రామ్ మాత్ర వెయ్యాలని తెలిపారు. ఒకవేళ పిల్లలకు నులిపురుగులు కడుపులో ఉంటే రక్తహీనత, ఆకలి మందగించడం, పోషకాల లోపం, బరువు తగ్గడం కడుపునొప్పి, వికారంగా ఉండడం జరుగుతూ ఉంటుందన్నారు. నులిపురుగులు నివారించడానికి ముఖ్యంగా పరిశుభ్రత పాటించుట చేతులు శుభ్రంగా కడుక్కోవడం, బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించడం తద్వారా నులిపురుగులు నివారించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది సహకరించాలని కోరారు. మందులు వేసేటప్పుడు ఏమైనా అనుమానాలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని, ఒకవేళ 17వ తేదీన వేయుట తప్పితే తర్వాత వారం, 24 ఫిబ్రవరి రోజున వేయబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి సునీల్ కుమార్, డాక్టర్ మౌనిక, డాక్టర్ దేవి, ఎంఈవో సత్యం, సిపిడిఓ పార్వతి, ఏవో అనురాధ, హెచ్ వి బి పద్మావతి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల సమస్యలు పరిష్కరించండి



**మందస, ఫిబ్రవరి 16(వార్త):** వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని వీఆర్వోల సంఘం నాయకులు మందస తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు పలు సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. పని ఒత్తిడితో వీఆర్వోలు యాక్సిడెంట్లు పాలవుతున్నారని, కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడంతో అధికారుల వైఖరిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో సంఘం అద్యక్షుడు పాండవ గజపతి, ఉపాధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## పాతినవలసలో సిసి రోడ్డుకు శంకుస్థాపన

**సోంపేట, ఫిబ్రవరి 16(వార్త):** మామిడిపల్లి పంచాయతీ పాతినవలసలో ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ కృషి మేరకు 8 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి సీనియర్ టిడిపి నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు సూరాడ చంద్రమోహన్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఈ రహదారి నిర్మాణం పట్ల పాతిన వలస గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు ఎనలేనివని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో జరగని అభివృద్ధి కేవలం రెండేళ్లలో విశేషంగా కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ సోమేశ్వర రావు, తిమ్మల వీరాస్వామి, సంగారు చిరంజీవి, దున్న వీరాస్వామి, ఎస్ ధర్మారావు, రత్నాల వాసు, రామారావు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.



# డేఅండ్‌నైట్ క్రికెట్ పోటీల్లో విజేతలకు ఘన సత్కారం

### - విన్నర్స్‌కు రూ.5.51 లక్షలు, రన్నర్స్‌కు రూ.5.25 లక్షలు అందజేత

**నరసన్నపేట, ఫిబ్రవరి 16(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు నిర్వహించిన డే అండ్ నైట్ క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ఘనంగా అందజేశారు. టిడిపి సమన్వయకర్త బగ్గు అర్చన చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. టోర్నమెంట్‌లో నరసన్నపేట ఫ్రెండ్స్ లెవెల్ జట్టు విజేతగా నిలవగా, కంచిలి మండలం శ్రీరాంపురం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.5.51 లక్షల నగదు బహుమతి మరియు షీల్డ్ అందజేయగా, రన్నర్స్ జట్టుకు రూ.5.25 లక్షల నగదు బహుమతితో పాటు ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని అతిథులు ఆకాంక్షించారు.



## విశాఖ రైల్వేజోన్‌లో ఇచ్ఛాపురం కలపాలి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16 (వార్త):** రాష్ట్రంలో ఏప్రిల్ ఒకటి తేదీ నుంచి ప్రారంభమ వుతున్న విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో ఇచ్ఛాపురం వరకు ఉన్న అన్ని స్టేషన్లు ను కలపాలని జెడ్‌అర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌలో, డి అర్ యు సి సి సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు కోరారు.ఇచ్ఛాపురం, జాడపూడి, సోంపేట బారువ మందస సుమా దేవి, పలాస రైల్వే స్టేషన్లు ను కలపాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడుతున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ లో ఈ స్టేషన్లో కలపక పోవడం వలన అభివృద్ధి లేక వెనుకబడి పోతాయని అన్నారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్లకు ఈ రైల్వే స్టేషన్లు 50 కిలోమీటర్ల దూరంలో ఉంటాయని సౌత్ కోస్ట్ రైల్వేలో కలిపితే అభివృద్ధి బాగా జరుగుతుందని అన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ఉండటం వలన ఈ రైల్వే స్టేషన్లో పై అభివృద్ధి చేయక చిన్న చూపు ఉందని అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుకలిసి ఈ రైల్వే స్టేషన్లను ఎలాగైనా సౌత్ రైల్వే జోన్ లో కలిపి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జ్ఞానభారతి సీఈవో దంపతులకు ఘన స్వాగతం

**ఇచ్ఛాపురం ఫిబ్రవరి 16 (వార్త):** విద్య వ్యవస్థలో మార్పులను, నూతన విధానాలను అధ్యయనం చేసేందుకు అమెరికా వెళ్లి ఇచ్ఛాపురం చేరుకున్న జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ సీఈవో జోహార్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రసీదా సుల్తానా దంపతులకు కు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘన స్వాగతం పలికారు. గత నెల 27వ తేదీన అమెరికా తరలి వెళ్ళిన జోహార్ ఖాన్ అమెరికా దేశంలో జార్జియా రాష్ట్ర రాజధాని అట్లాంటాలో ఇన్నోవేటివ్ అకాడమీ సంస్థను సందర్శించారు. అక్కడి విద్యా విధానాలను పరిశీలించారు. విద్యా బోధనలో దశాబ్దాల అనుభవం ఉన్న ప్రొఫెసర్లతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ప్రస్తుత కాలంలో విద్యావ్యవస్థలో చోటు చేసుకోబోతున్న మార్పులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. భారతదేశంలో వాటిని అమలు చేసేందుకు ఎటువంటి విధానాలు పాటించాలో చర్చించారు. జోహార్ ఖాన్ ని స్వాగతించిన వారిలో పాఠశాల ప్రిన్సిపల్ ఐబి పండ, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు ఉన్నారు.



## ఉద్రిక్తత నడుమ లింగోద్భవ వేడుక

### -పోలీసులకు -ఆలయ ట్రస్టుకు వాగ్వాదం
### -పాత్రికేయులకు ప్రవేశం నిరాకరణపై అసంతృప్తి

**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విశేష



పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 12 గంటల సమయంలో భక్తిశ్రద్ధల నడుమ శ్రీముఖలింగేశ్వరుని లింగోద్భవం కార్యక్రమాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్త వారసురాలు కుమారి కళ్యాణి గజపతి నారాయణ మహాదేవ చేతుల మీదుగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమం సందర్భంగా పోలీసులు మరియు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొంతమందిని బయటకు పంపించినట్లు సమాచారం. ఇక మరో వైపు, ఆలయంలో జరుగుతున్న లింగోద్భవ కార్యక్రమానికి పత్రికేయులకు ప్రవేశం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామంలోని సాధారణ ప్రజల చేత ఫొటోలు, వీడియోలను తీయించారు. కానీ ఒక పాత్రికేయునికి కూడా ప్రవేశం ఇవలేదు. భక్తుల ప్రవేశం నిలిపివేసినట్లు ప్రకటిస్తూ సుమారు 20 మంది పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి వారికే అనుమతి ఉన్నట్లు పాత్రికేయులకు తెలిపినా, వాస్తవానికి దాదాపు 60 మందిని ఆలయ వర్గాలు లోపలికి అనుమతించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ పరిణామాలపై పాత్రికేయులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శక విధానాలు పాటించాలని,



## మృత్యువుతో పోరాడుతున్న యువకుడు



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 16(వార్త):** జోడూరు గ్రామానికి చెందిన యువకుడు భార్గవ్ ఆదివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నాడు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే మెళియాపుట్టి మండలం జోడూరు గ్రామానికి చెందిన తిప్పాన రాము కుమారుడు భార్గవ్ (20) శివరాత్రి నాడు శివాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ద్విచక్ర వాహనంపై సామాగ్రి తీసుకొని వెళ్తుండగా పట్టుపురం జోడూరు మార్గమధ్యంలో చెట్టుకు గుద్ది రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు విషయం తెలుసుకొని 108 వాహనంలో టెక్కలి ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్ కి తరలించినట్లు తెలుస్తుంది. భార్గవ్ ప్రస్తుతం పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీలో ఐటిఐ పూర్తిచేసుకుని డిఫెన్స్ కోసం ప్రిపేర్ అవుతున్నట్లు తల్లిదండ్రులు తెలుస్తుంది. భార్గవ్ కు ప్రమాదం జరగడం పట్ల తల్లిదండ్రులు కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు, జరిగిన సంఘటనపై గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి చెందుతున్నారు.

## శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించిన కృష్ణదాస్ దంపతులు



**జలుమూరు, ఫిబ్రవరి 16(వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వర ఆలయంను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తన సతీమణి పద్మప్రియతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆలయానికి చేరుకున్న కృష్ణదాస్ దంపతులకు అర్చకులు, దేవస్థాన అధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో కృష్ణదాస్ దంపతులతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. జలుమూరు ఎంపీపీ వాన గోపి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, డీఎల్డీసీ అధ్యక్షులు నక్క తులసీదాస్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## బడ్జెట్లో ఉద్దాన ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులేవీ : బాబా

**పలాస, ఫిబ్రవరి 16(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనుకబడిన ప్రాంతాలలో ఒకటైన శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించడంలో మరోసారి మొండి చేయి చూపించారని, ఎన్నో ఏళ్లుగా పలాస జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం ఎదురుచూసిన ఈ ప్రాంత ప్రజానీకం ఆశ నిరాశగా మారిందని ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరమైనప్పటికీ, ఉద్దానం మరింత వెనుకబాటు తనలోకి నెట్టివేయబడుతుందని దువ్వాడ శ్రీధర్(బాబా) పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రాంత పార్లమెంట్ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పలాస జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.



## స్థానిక రైల్వే స్టేషన్లను విశాఖ జోన్‌లో విలీనం చేయండి


### -జెడ్ఆర్‌యు సిసి సభ్యుడు శ్రీనివాస్ రౌలో

**సోంపేట, ఫిబ్రవరి 16(వార్త):** విశాఖపట్నం కేంద్రంగా ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్న సౌత్‌కోస్ట్ రైల్వే జోన్‌లో ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు సంబం ధించిన ఒడిశా సరిహద్దు రైల్వే స్టేషన్లను విలీనం చేయాలని జెడ్ఆర్‌యు సిసి సభ్యుడు శ్రీనివాస రౌలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు లేఖ రాశారు. ఇప్పటి వరకు కుర్దా డివిజన్లో కొనసాగుతున్న ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు మధ్యనున్న స్టేషన్లన్నీ సరైన అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు కానున్న సౌత్ కోస్ట్ జోన్ లో ఇచ్ఛాపురం, జాడుపూడి, సోంపేట, బారువ, మందస, సుమా దేవి, పలాస స్టేషన్లను విలీనం చేయడం ద్వారా త్వరగా అభివృద్ధికి అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిస్సా కేంద్రంగా ఖుర్దా డివిజన్ ద్వారా ఆంధ్రాలో ఉన్న స్టేషన్లను ఇప్పటివరకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలమైన ప్రాంతం కలిగిన ఇటువంటి స్టేషన్లను ప్రయాణికుల రద్దీ దృశ్య అనేక సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికి తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ బ్రిటిష్ కాలం నాటి రైల్వేస్టేషన్లనే కొనసాగించడం ఈ ప్రాంతీయ దురదృష్టకరమని శ్రీనివాస రౌలో ఆవేదన వ్యక్తం చేస్తారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర రైల్వే శాఖ మంత్రి తో మాట్లాడి ఈ ప్రాంత రైల్వేస్టేషన్లను అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని వేడుకున్నారు. పైన పేర్కొన్న స్టేషన్ల నుంచి నిరంతరం సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తున్నప్పటికీ రైళ్లు హాల్ట్ లేకపోవడం, స్టేషన్లో అభివృద్ధికి నోచుకోకపోవడం మా ఉద్దానం ప్రాంతీయుల దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి పట్టం కడుతున్న ఉద్దానం ప్రాంతం పట్ల ప్రత్యేక దృష్టి సారించి మా ప్రాంత రైల్వే స్టేషన్లను సౌత్ జోన్ లో విలీనం చేసి మరింత అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.



## అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్ : బమ్మిడి

**పలాస, ఫిబ్రవరి 16(వార్త):** కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టే వేసే విధంగా ఉందని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యో ధనరావు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పలాసలో తన స్వగృహంలో మీడియాతో మాట్లాడా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ బడ్జెట్ 3,32,205 కోట్ల రూపాయలతో వివిధ రంగాలకు కేటాయింపులు చేసినట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ, ఆచరణలో అసాధ్యమన్నారు. అంచనాలకు తగిన రాబడి లేకపోవడంతో,ఏదో ప్రజలకు మభ్య పెట్టేందుకు కాగితాలతోనే కేటాయింపులు చేసి, అంకెల గారిడి చూపిస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఆ నిధులపై స్పష్టత లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



## జీడి..మామిడి సాగులో అప్రమత్తం



**మందస, ఫిబ్రవరి 16(వార్త):** ఉద్దానం జీవనాధారమైన జీడి, మామిడి పంటలకు ప్రస్తుతం చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. లేత చిగురు దశ నుంచి పిక్క దశ వరకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానవనశాఖ అధికారి సీహెచ్ శంకరదాస్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, పంటలకు నష్టం కలుగుతుందని చెబుతున్నారు. హెచ్ఓ శంకరదాస్ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు, సిబ్బంది గిరిజన, ఉద్దాన, మైదాన ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతులతో ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశాల్లో జీడి, మామిడి పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఆయా పంటల వద్దకు రైతులను తీసుకెళ్లి.. ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎటువంటి మందులు వాడాలి.. లేత చిగురు దశ, మొగ్గ దశ, పువ్వు దశ, లేత పిక్కదశ, ముదురుతోటలు/నిర్లక్ష్యం చేయబడిన తోటలను ఎలా అభివృద్ధి చేయాలో ప్రత్యక్షంగా శంకరదాసు వివరిస్తున్నారు. ఉద్యానవనశాఖ అధికారిగా సీహెచ్ శంకర్ దాస్ చెబుతున్న వివరాలు ఇలా ఉన్నాయి.

లేత చిగురు దశ (అక్టోబర్-నవంబర్), పువ్వు మొగ్గ దశ(డిసెంబర్-జనవరి), పువ్వు విచ్చుకున్న దశ (ఫలధీకరణ దశ), లేత పిక్క దశ (ఫిబ్రవరి-మార్చి), ముదురు తోటలు /నిర్లక్ష్యం చేయబడిన తోటలు అనే దశలు ఉంటాయి. ఆయా దశలలో ఆశించే చీడ, పీడలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారి చేయాల్సిన మందులు.

తేయాకు దోమ(టీ దోమ) తెగులు, ఆకు, పుష్ప గుచ్ఛం గూడు కట్టు కొను పురుగు, ఆకు తొలుచుపురుగు, ఆకు ముడత పురుగు, కొమ్మ, పుష్ప గుచ్ఛముల చివర్లను తొలచు పురుగు, కాయ లేదా గింజ తినే పురుగు, ఆకు తినే పురుగు, తామర పురుగులు, పిండి నల్లి, కాండం వేరు తొలుచు పురుగు తదితర తెగుళ్లు సోకుతాయి.

### నివారణ చర్యలు

మోనోక్రోటోఫోస్ ఏ 1.6 మి.లీ/లీటరు (లేదా) థయోమిథాక్సిమ్ ఏ 0.2 గ్రా. /లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. చిగురు రాని కొమ్మలకు / చెట్లకు యూరియా ఏ2గ్రా. /లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

లార్డసైహలోత్రిన్ 5% జుజఏ 0.6 మి.లీ/లీటరు (లేదా) క్లోరిపైరీఫాస్ 2 మి.లీ/లీటరు మరియు సాఫ్ (కార్బండిజమ్ మ్యాంగో జెబ్) 1 గ్రా. /లీటరు నీటికి కలిపి కొమ్మలు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

ఈ దశలో పురుగు, తెగుళ్ల ఉధృతి లేనప్పుడు ఎటువంటి మందులు పిచికారి చేయరాదు. పురుగు తీవ్రత బట్టి అవసరమైన మేరకు వేపనూనె 1500పీపీఎం 5 మి.లీ/లీటరు (లేదా) ఇమిడాక్లోప్రిడ్ ఏ 0.25 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ప్రొఫెనోఫాస్ 50ఈసీ 1మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నాణ్యమైన పిక్క దిగుబడికి సుక్ష్మధాతువుల మిశ్రమము (ఫీ-4) 2గ్రా. ం పొటాషియం నైట్రేట్ 5గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జీడిమామిడి తోటలను శుభ్రం గా ఉంచాలి. చెట్ల మొదళ్ళలో, చుట్టూ 1.5 మీ. దూరం వరకు కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చెయ్యాలి. పురుగు సోకిన చెట్లను మొదటదశలోనే గుర్తించి పై బెరడును తొలచి కాండం, వేర్ల లోపల దాగియున్నలద్దె పురుగులను ఇనుపచువ్వతోగుచ్చి బయటకులాగి నిర్మూలించాలి.నెలవారి వ్యవధిలో నిరంతర సర్వే చేసి ప్రారంభ దశలో పురుగు ఆశించిన చెట్టు లోపల ఉన్న పిల్లపురుగులను (గ్రబ్స్) చెట్టుకు కనీస నష్టం కలగకుండా జాగ్రత్తగా తీసి చంపివేయాలి. చెక్కపొడి మరియు బంకను తొలగించి, ప్రభావిత భాగాన్ని క్లోరిపైరీఫాస్ 10 మి.లీ/లీటరు నీటితో కలిపి పిచికారి చేయడం ద్వారా మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే పూర్తిగా చనిపోయిన చెట్లను వేరు చెయ్యడం, వాటిని నాశనం చేయడం వంటివి క్రమం తప్పకుండా అనుసరించాలి.

### ముఖ్య గమనికలు:

మోతాదుకు మించి పురుగుమందులు పిచికారి చెయ్యరాదు.ఉదయం (6-9), ఆలస్యంగా మధ్యాహ్నం (4-6), ఫలధీకరణ దశ/పిక్క కడుతున్న దశలో అవసరం లేకుంటే పురుగు మందులు పిచికారి చేయకూడదు. రైతుసేవాకేంద్రం ఉధ్యాన/వ్యవసాయ సహాయకులు సలహా మేరకు పురుగుమందులు పిచికారి చేసుకోవాలి. ఎప్పటికప్పుడు రైతులు జీడిమామిడి తోటలలో టి-దోమ/రసం పీల్చేపురుగుల ఉధృతి గమనించికొని తదనుగుణంగా పురుగుమందులు పిచికారి చేసుకోవాలి.

## అలరించిన నృత్యాలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16 (వార్త):** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రామ లింగేశ్వర స్వామి దేవాలయం మఠం సరియపల్లి గ్రామములో స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం నాట్య కళాకారులచే కూచిపూడి జానపద నాట్య ప్రదర్శనలు నిర్విరామంగా జరిగాయి. శివతాండవం క,దిలింది కైలాస శిఖరం,ఆనందతాండవం శివ శివ శంకర'దశావతారములు నవదుర్గ ప్రదర్శనలకు గ్రామ ప్రజలు పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను అభినందించారు. ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు నాట్య గురువు మంగి దివ్య, కుమార్. డి.శిరీష పట్నాయక్, బి భవాని, పి వర్షిత, టి ఉషారాణి, డి ఉపాసన , సిహెచ్ భూమిక, బి అనుశ్రీ, కేవీఎల్ గాయత్రి, టీ కావ్య, బి జోష్న, పి చార్వి, బి నీరజ, అస్మితాపూరి, బి యశ్విత, జి రక్షిత, జె మాన్విసా, టి ఆశ, టీ రేష్మిత, టీ చైత్ర, పి వర్ణిక, బి మోక్ష, డి అక్షిత, బి జోష్ణ, 25 మంది నాట్య కళాకారులు పాల్గొన్నారు. నాట్య కళాకారులతో నాట్య గురువు మంగి దివ్య, అకాడమీ అధ్యక్షులు కే గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మలకు ఆలయ కమిటీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

### -డి. ఆర్. ఓ, ఎస్. వి. లక్ష్మణమూర్తి
### -94 అర్జీల స్వీకరణ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16(వార్త):** అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎస్వీ. లక్ష్మణమూర్తి, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, (పి.జి.ఆర్.యస్) పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి , జయదేవితో కలసి ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పెండింగ్ లో లేకుండా తగు పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి వివిధ శాఖలకు పరిష్కారం కోరుతూ వచ్చిన 94 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-(జజూూా)36, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ సెటిల్మెంట్స్ కోరుతూ 11,సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ-8, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-5, పంచాయతీరాజ్ 4, ఎపిఈపీడిసియల్-4 , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 3, వాటర్ రిసోర్స్ 3, రోడ్లు మరియు భవనాల శాఖ 3, పోలీస్ శాఖ 2, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 2, మైన్స్ అండ్ జియాలజీ 2, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ 1, సోషల్ వెల్ఫేర్ 1, యానిమల్ హస్బెంద్రి 1, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ 1, గ్రామ, వార్డు మరియు విలేజ్



సెక్రటేరియట్ వార్డు సెక్రటరీ 1, రూరల్ డెవలప్మెంట్ 1, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ 1, వికలాంగుల శాఖ 1, స్కిల్ డెవలప్మెంట్ 1, రూరల్ వాటర్ సప్లై 1, వ్యవసాయ శాఖ 1, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఇప్పటివరకు వివిధ శాఖలలో పెండింగులో ఉన్న అన్ని (పి.జి.ఆర్ .యస్) ఫిర్యాదులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పద్మావతి, జయదేవి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ ఎదురుదాడికి ఖండన

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 16(వార్త):** ఇచ్ఛాపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఇటీవల జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో వైస్సార్సీపీ పార్టీకి చెందిన సర్పంచ్లు, ఎంపీటీసీలు రౌడీల్లా ప్రవర్తించి వేదిక పై ఉన్న పీఏసీఎస్ అధ్యక్షులు పెదిని బాబ్జి పై దాడికి పాల్పడటం దురదృష్టకమరని ఇలాంటి సంఘటనలు మండల పరిషత్ చరిత్రలో ఎన్నడూ చూడలేదని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షలు లోపింటి పద్మనాభం అన్నారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అదికారులు ఆహ్వానం మేరకు పీఏఎస్ అధ్యక్షులు సమావేశంలో ఉండగా పీఏసీస్ అధ్యక్షులుపై ఏ ప్రోటాకాల్ ఉందని విమర్శిస్తూ దాడికి పాల్పడటం అత్యంత దురదృష్టకరమని ఇలాంటివి మరలాపునారావృతం అయితే సహించేది లేదని అన్నారు. టీడీపీ నాయకులు సహనాన్ని పరిక్షిస్తే తరువాత జరిగే పరిణామాలు వేరేలా ఉంటాయని విమర్శించారు. గతంలో వైసీపీ పార్టీకి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు సమావేశంలో పాల్గొనలేదా? గతం మరిచిపోయారా? ఆ సమావేశంలో హౌసింగ్ ఏఈ హౌసింగ్ కు సంబందించిన విషయాలు చెబుతుండగ అడ్డుపడిన వైసీపీ పార్టీకి చెందిన సర్పంచ్ ప్రసాద్ ముఖ్యమంత్రి హౌసింగ్ కు రూ4లక్షలు ప్రకటించారు కదా లబ్దిదారులకు అంత ఇవ్వరా అని ప్రశ్నిస్తుండగా ఇస్తామని కూటమి ప్రభుత్వం జీఓ విడుదలచేసిందని పీఏసీఎస్ అధ్యక్షులు పెదిని బాబ్జీ సమాదానం చెప్పినందుకు రౌడీల్లా ఎంపీటీసీలు, సర్పంచ్లు ఒకేసారి పోడియం మీదకు వచ్చి దాడికి పాల్పడటం అత్యంతదారుణమైన సంఘటన అని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకులుఎంపీటీసీ మేరుగు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలుపై పోరాడవల్సిన ప్రజాప్రతినిదులు గౌరవ సర్వసభ్య సమావేశంలో గూండాలా ప్రవర్తించటం సరికాదని హెచ్చరించారు. ప్రజల సమస్యలుపై చర్చించకుండా వ్యక్తిగత దూషణలతో సమావేశాన్ని అవమానపరిచిన వైసీపీ నాయకులకు ప్రజలే సరైన బుద్దిచెబుతారని మేరుగు సూర్యనారాయణ అన్నారు. గతంలో వైసీపీ పార్టీకి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు అన్నిసమావేశాలకు వచ్చారని, అని తెలిపారు. సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారుప్రజలు సమస్యలు తెల సుకొని సమావేశాలలో వాటిపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలే తప్పా ఇలాంటి రౌడీ యిజాలకు పాల్పడటం దారుణమని అన్నారు. . ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దక్కత శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షులు పెదిని బాజ్జీ, గిన్ని బాలరాజు, సాడి సహదేవ్ రెడ్డి, దక్కత కామేష్, కె.గోపి, చంద్రశేఖర్, బి లోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.



## రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16(వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు ఆదేశాల మేరకు రహదారి భద్రత, మత్తు పదార్థాలు పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "రహదారి భద్రత నియమాలు పాటించండి -- మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి,( డ్రగ్స్ వద్దు బ్రో )" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను అదనపు



ఎస్పీ కెవి రమణ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గారు మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు కు అలవాటు పడడం ద్వారా వారి జీవితం అందాకారంగా మారటం మారటం తో పాటు వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్/సీట్‌బెల్ట్ ధరించడం, అధిక వేగం నివారించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రత, డ్రగ్స్ నియంత్రణ పై అన్ని పాఠశాలలు కళాశాలలో పాటుగా పబ్లిక్ ప్రదేశాలలో పోస్టర్లను అతికించి మరింత అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వి రామారావు, జిల్లా డి.టి.ఆర్.బి విభాగం సబ్ ఇన్స్పెక్టర్ సురేష్, సామాజిక కార్యకర్త వంగపండు రవికుమార్ పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546